'మనూ' పరిశోధక విద్యార్థికి పీహెచ్‌డీ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థికి బుధవారం పీహెచ్‌డీని ప్రకటించారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో షకీల్ అహ్మద్ ప్రొఫెసర్ కనీజ్ జెహ్రా పర్యవేక్షణలో 'ఇ -గవర్నెన్స్ ఈజ్ టూల్ ఫర్ గుడ్ గవర్నెన్స్: ఏ స్టడీ ఆఫ్ ఖిద్మత్ సెంటర్స్ ఆఫ్ డిస్ట్రిక్ట్ పూంచ్ ఆఫ్ జమ్మూకశ్మీర్' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించారు.

నేడు ఐఎస్‌బీలో పుస్తకావిష్కరణ

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తారు. 'పవర్ వితిన్ ది లీడర్‌షిప్ లెగసీ ఆఫ్ నరేంద్రమోడీ' పేరిట రచయిత, పబ్లిక్ పాలసీ అడ్వకేట్, లీడర్‌షిప్ ట్రైనర్ బాలసుబ్రహ్మణ్యం రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. కార్యక్రమంలో ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ ఎం పిల్లుట్ల పాల్గొంటారు.

ఆలయ అభివృద్ధికి లక్ష విరాళం



కాలనీవాసులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్‌చంద్రబోస్‌నగర్‌లోని శ్రీ అభయాంజనేయ ఆలయ విస్తరణకు కావలసిన స్థల సేకరణకు విరాళంగా ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ లక్ష రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అంకారావు, నర్సింహ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాలనీలో వనమహోత్సవం



హఫీజ్‌పేట్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ పిలుపునిచ్చారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో వనమహోత్సవం కార్యక్రమంలో బుధవారం స్థానిక కార్పొరేటర్ పూజిత గౌడ్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి మనుగడకు చెట్లు ముఖ్యమని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి జోన్ యూబీడీ సిబ్బంది, ఆర్టీసీ కాలనీ వాసులు, మహిళలు పాల్గొన్నారు.

కరెంట్ స్తంభాలు.. కష్టాలు





బస్తీల్లో తుప్పపట్టి, ఒంగిపోయిన ఇనుప విద్యుత్ స్తంభాలు

- వాన పడితే విద్యుత్‌షాక్‌లు
- వర్షాకాలం.. బిక్కుబిక్కుమంటున్న స్థానికులు

రాయదుర్గం: రాయదుర్గంలోని బస్తీల్లో తుప్పుపట్టిన ఇనుప విద్యుత్ స్తంభాలతో స్థానికులు భయపడుతున్నారు. ఓవైపు వర్షాకాలం ప్రారంభమవడంతో ఇనుప స్తంభాలతో ఎపుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. వీటి స్థానంలో సిమెంట్ స్తంభాలను వేయాలని కోరినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు.కాగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రాయదుర్గం కొనసాగుతున్నప్పటికీ విద్యుత్ విభాగం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోకి వస్తోంది. దీంతో సంబంధిత అధికారులు ఈ ప్రాంతంను పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. గతంలో కొన్నింటిని మార్చారని ఇంకా 30 దాకా ఐరన్ స్తంభాలే ఉన్నాయని వీటి స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల రాయదుర్గం ప్రధాన రోడ్డులోని విద్యుత్ స్తంభంపై మంటలు రేగాయి. వర్షాకాలంలో విద్యుత్ షాక్ కొట్టే అవకాశం ఉందని పొరపాటున తగిలితే పరిస్థితి ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రధాన, అంతర్గత రోడ్లపైనే కాకుండా ఇళ్ల నడుమన ఉన్నాయని వెంటనే సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.





రాయదుర్గంలో అంతర్గత రోడ్లపై ఉన్న ఐరన్ స్తంభాలు

ఏళ్లుగా కోరుతున్నా పట్టించుకునే వారు లేరు



రాయదుర్గం బస్తీలలో ప్రస్తుతం ఉన్న ఐరన్ స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలి. గల్లీల్లో ఇనుప స్తంభాలు ఉన్నా యి. వర్షం పడుతున్న సమయంలో అటువైపు వెళ్లేవారు భయపడుతున్నారు. సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలి. – దారుగుపల్లి నరేష్, రాయదుర్గం

షేక్‌పేట్ నుంచి గచ్చిబౌలికి మార్చాలి



శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రాయదుర్గం కొనసాగుతున్నా విద్యుత్ విభాగం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోకి వస్తోంది. దీంతో సంబంధిత అధికారులు ఈ ప్రాంతం పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి ఈ ప్రాంతాన్ని గచ్చిబౌలి సబ్‌స్టేషన్ పరిధిలోకి మార్చాలి. – గణేష్ మాదిగ, రాయదుర్గం

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

శేరిలింగంపల్లి: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భాగ్యనగర్ మునిసిపల్ జీహెచ్‌ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు శంకర్ తెలిపారు. శేరిలింగంపల్లిలోని యూనియన్ కార్యాలయంలో ఉద్యోగులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళానని, వాటి పరిష్కారానికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి అష్రఫ్, నాయకులు మొయిన్, శ్రీధర్, బాలేష్, జోన్ అధ్యక్షులు గోపాలకృష్ణ, సెక్రటరీ నర్సింగ్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని జెడ్సీకి వినతి



రాయదుర్గం: జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని బుధవరం గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి కలిసి డివిజన్‌లోని నల్లగండ్ల హుడాకాలనీ, నానక్‌రాంగూడ, గౌలిదొడ్డి, కేశవనగర్, గోపన్‌పల్లిలో భూగర్భ డ్రైనేజీ, సీసీరోడ్లు, మంచినీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం నల్లగండ్ల హుడాకాలనీలో గల కమ్యూనిటీ హాల్ మరమ్మతులు చేయించాలని, ఖాజాగూడలోని సాయిఐశ్వర్య కాలనీలో ఉన్న పార్కు స్థలంలో ఓపెన్ జిమ్, చిల్డ్రెన్స్ పార్కు, క్రీడా ప్రాంగణం, ప్రహరీగోడ, కేశవనగర్‌లోని శ్మశానవాటిక అభివృద్ధి చేయాలని కోరారు. అనంతరం నల్లగండ్ల హుడా కాలనీవాసులతో కలిసి జెడ్సీకి వినతి పత్రాన్ని అందించారు.

రోడ్డు పనుల్లో నాణ్యత తప్పనిసరి



చాకలిచెరువులో గుర్రపు డెక్క తొలగింపును పరిశీలిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ ఆదర్శనగర్‌లో సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి అని అన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, బస్తీ కమిటీ అధ్యక్షులు గోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్రపుడెక్క తొలగింపు

శేరిలింగంపల్లి చాకలి చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులను కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్రపు డెక్క వలన దోమలు ప్రబలుతున్నాయని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని గుర్రపు డెక్క పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ కిరణ్ పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కారం

చర్యలు తీసుకున్న జలమండలి అధికారులు



మియాపూర్: మియాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం రోడ్డులో మురుగు సమస్యను జలమండలి అధికారులు బుధవారం పరిష్కరించారు. సాక్షి దినపత్రిలో మంగళవారం మురుగు సమస్య అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు జలమండలి అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించారు. సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

లేబర్ కోడ్ బిల్లులను రద్దు చేయాలి



డిప్యూటీ తహశీల్దార్ శంకర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

శేరిలింగంపల్లి: కార్మికుల హక్కులను కాలరాస్తున్న నాలుగు లేబర్ కోడ్ బిల్లులను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ శేరిలింగంపల్లి కన్వీనర్ కొంగరి కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఇచ్చిన పిలుపులో భాగంగా శేరిలింగంపల్లి తహశీల్దార్ కార్యాలయంలో కార్మికుల డిమాండ్ల వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న కార్మికుల హక్కులను కాలరాసే విధంగా బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్ బిల్లులను రద్దు చేయడంతో పాటు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. ప్రతి రంగంలో ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. గతంలో సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఇచ్చిన తీర్పును ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు.

గురుకుల హాస్టల్‌లో నీటి సమస్యను పరిష్కరించాలి

మియాపూర్: మైనార్టీ గురుకుల హాస్టల్‌లో నీటి సమస్యను పరిష్కరించాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి అన్నారు. మియాపూర్ డివిజన్‌లో మయూరినగర్ హెచ్‌ఎండబ్ల్యూఎస్ హఫీజ్‌పేట సెక్షన్ మేనేజర్ పూర్ణేశ్వరిని కలిసి వినతిపత్రం అందజేశారు. మాదాపూర్ డివిజన్ పరిధిలో గోకుల్ ప్లాట్స్‌లో ఉన్న మైనార్టీ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో 400 మంది పేద మధ్యతరగతి విద్యార్థులు చదువుకుంటున్నారు. హాస్టల్‌కు సరఫరా అవుతున్న నీరు సరిపోక పిల్లలు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. కాలకృత్యాలకు కూడా నీరు సరిపోవడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో రోజు నాలుగు ట్యాంకర్ల మంచినీటిని పంపించాలని కోరగా ఆమె సమస్య పరిష్కారనికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీవై నాయకులు దశరథ్, యండి.సుల్తానా బేగం, ఇస్లావత్ దశరథ్ నాయక్, గూడ లావణ్య, రజియాబేగం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణతో ట్రాఫిక్ సమస్య పరిష్కారం

మాదాపూర్‌లో రహదారులను పరిశీలించిన అధికారులు



మాదాపూర్: ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రోడ్ల విస్తరణలో భాగంగా బుధవారం సైబరాబాద్ జాయింట్ సీపీ జోయెల్ డేవిస్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, మాదాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సయ్యలతో కలసి పలు ప్రాంతాల్లోని రహదారులను పరిశీలించారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్ల పక్కన వ్యర్థాలను వెంటనే తొలగించాలని సూచించారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలో బయోడైవర్సిటీ కొత్తగూడ కూడళ్ళు, రాడిసన్ హోటల్, రోలింగ్‌హిల్స్, మసీద్‌బండ, కొండాపూర్, హైటెక్‌సిటీ ప్రాంతాలలో పర్యటించి రోడ్లను పరిశీలించారు. రహదారుల పక్కన ఇసుక పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. సర్కిల్‌లో డీసీ స్థాయి నుంచి కింది స్థాయి వరకు పర్యవేక్షణ అధికారులు రోజువారీ పారిశుద్ధ్య పనులను పరిశీలించాలన్నారు. కొత్తగూడ కూడళ్లలో ఏఎంబి మాల్‌వద్ద రహదారులపై ఎత్తు పల్లాలను సరిచేయాలని చెప్పారు. అనంతరం ఎన్‌కన్వెన్షన్ బైలైన్ నుంచి యశోద హాస్పిటల్ మీదుగా బుట్టా కన్వెన్షన్ వరకు రోడ్డు విస్తరించినట్లైతే ట్రాఫిక్ సమస్యలను అధిగమించవచ్చని ఈ సందర్భంగా అధికారులు అభిప్రాయపడ్డారు.

జెడ్సీని కలిసిన కార్పొరేటర్

గచ్చిబౌలి: జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని బుధవారం కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్ మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి, పూలమొక్కను అందించారు. కొండాపూర్ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను ఆయనకు వివరించారు. జరిగిన అభివృద్ధి, ఇంకా మిగిలిన పనులు, చేపట్టాల్సిన పనులపై జెడ్సీకి వివరించి పనులు త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అశోక్‌గౌడ్ ఉన్నారు.

భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతం



తాపీ మేస్త్రీల సమావేశంలో పాల్గొన్న టెక్నికల్ ఇంజనీర్ శివకుమార్, డీలర్ నర్సిరెడ్డి

గచ్చిబౌలి: సిమెంట్ వ్యాపారంలో భారతి సిమెంట్ తిరుగులేని సంస్థగా ఎదిగిందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజనీర్ శివకుమార్ పేర్కొన్నారు. బుధవారం కొండాపూర్‌లోని మాదాపూర్ స్టీల్ హౌస్‌లో తాపీ మేస్త్రీల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్‌ను తెలంగాణలో విడుదల చేసిందని తెలిపారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. అల్ట్రాఫాస్ట్ స్లాబ్‌లు, పిల్లర్లు, రహదారులు, వంతెనల నిర్మాణానికి సరైందని ఆయన పేర్కొన్నారు. స్లాబ్ వేసే సమయంలో సైట్ వద్దకే ఇంజనీర్లు వచ్చి అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచితంగా సాంకేతిక సహాయం అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో భారతి సిమెంట్ మార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ అయ్యప్ప రెడ్డి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని ఎల్‌ఐజీ కాలనీలోని పార్కు ఆవరణలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.

అసంపూర్తి రోడ్డుతో అవస్థలు

గుమ్మడిదల– కానుకుంట రోడ్డులో తరచూ ప్రమాదాలు



జిన్నారం(పటాన్‌చెరు): ఏడాదిన్నరగా రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు బాగా లేకపోవటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గుమ్మడిదల నుంచి అనంతారం గ్రామం మీదుగా కానుకుంట వరకు డబుల్ రోడ్డును వేయించేందుకు ఏడాదిన్నర క్రితం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ. 1.50కోట్లు మంజూరవగా మరో రూ. 7.50 కోట్ల సీఎస్ఆర్ నిధులు కేటాయించి డబుల్‌రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఈ రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇరువైపులా రోడ్డు వేసేందుకు గుంతలు తీసి మట్టి పోసి వదిలేశారు. దీంతో వాహనాల రాకపోలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ రోడ్డుపై ఎక్కువగా మూలమలుపులు ఉండటంతో తరచూ ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. ఇక గుంతల రోడ్లతో వాహనాలు కూడా చెడిపోతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. కాగా ఇటీవల జరిగిన మండల సమావేశంలో ప్రజాప్రతినిధులు రోడ్డు విషయమై అధికారులను నిలదీశారు. ప్రభుత్వాధికారులు స్పందించి రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

త్వరగా పూర్తి చేయిస్తాం

గుమ్మడిదల– కానుకుంట రోడ్డు పనుల్లో కొంత జాప్యం జరిగింది. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయించేలా చర్యలు చేపడుతున్నాం.
–రామరాజు, ఆర్‌అండ్‌బీ ఏఈ

ఆర్ట్‌గ్యాలరీలో స్వదేశీ వస్త్ర ప్రదర్శన ప్రారంభం



మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీ ఆడిటోరియంలో బుధవారం స్వదేశీ వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి ప్రారంభించారు. ఆకర్షణీయమైన రంగులతో, నాణ్యమైన వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రదర్శన ఈనెల 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 7.30 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.